Digital, tmedia.net.in

టీ-మీడియా

TMEDIA
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 145
సంచిక : 261
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శనివారం, జూన్ 06, 2026

శిక్ష పడేలా చేయడంలో అధికారుల పాత్ర

-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

టీ మీడియా, జూన్ 5,భద్రాద్రి కొత్తగూడెం :స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ తో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు డ్యూటీ అధికారులకు కేసుల పట్ల పూర్తి అవగాహన స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కల్పించాలని సూచనలు చేశారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్రంగా కేసులను పర్యవేక్షించాలని ఆదేశాలను జారీ చేశారు. సమ్మన్స్, వారెంట్ల జారీలో జాప్యం లేకుండా సకాలంలో సాక్షులకు మరియు నిందితులకు అందజేయాలని సూచించారు. కోర్టులో విచారణ నడిచే సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసుకోవాలని, సాక్షులకు కేసు వివరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీని ఎప్పటికప్పుడు కోర్టులో హాజరు పరచాలి అని సూచనలు 3లో

మహబూబాబాద్ కలెక్టరేట్‌లో

సీఐడీ సోదాలు

గనుల శాఖలో ఏమి జరుగుతోంది..?

వివరాలు వెల్లడించని అధికారులు

కొనసాగుతున్న తనిఖీలపై ఉత్కంఠ

టిమీడియా, జూన్ 5 కురవి:
మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని గనులు, భూగర్భ శాఖ కార్యాలయంలో శుక్రవారం సీఐడీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఉదయం నుంచి కార్యాలయంలో కొనసాగుతున్న ఈ సోదాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించకపోవడంతో అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సీఐడీ అధికారుల బృందం కార్యాలయంలోని పలు రికార్డులు, ఫైళ్లు, అనుమతులు, లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొంతమంది సిబ్బందిని కూడా అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే తనిఖీలకు గల అసలు కారణం ఏమిటన్న విషయంపై అధికార వర్గాలు మౌనం పాటిస్తున్నాయి. ఇటీవల జిల్లాలో ఖనిజ సంపద తవ్వకాలు, ఇసుక రీచ్‌ల నిర్వహణ, గనుల అనుమతులు, రవాణా అంశాలపై వివిధ స్థాయిల్లో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలోనే ఈ సోదాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై ఎటువంటి 3లో



ప్రయివేట్ విద్యకు నకిలీ మరక

అనుమతి కోసం బోగస్ ఇంటి నంబర్ల సృష్టి

- అక్రమ అడ్మిషన్ల కోసం రికార్డుల్లోనే స్కూళ్లు

ఖమ్మం కథనం (1)

టి మీడియా, జూన్ 5, ఖమ్మం బ్యూరో:కొంతమంది ప్రైవేట్ విద్యాసంస్థల కాసుల కక్కుర్తి కారణంగా మొత్తం ప్రైవేట్ విద్యారంగానికే నకిలీ మరక అంటింది. ఖమ్మం నగరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 117 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, వాటిలో 50కి పైగా నకిలీ పత్రాలతో అనుమతులు పొందినవిగా ఆరోపణలు ఉన్నాయి.కొంతమంది నకిలీ ఇంటి నంబర్లు సృష్టించగా, మరికొందరు మున్సిపల్ రికార్డుల్లో నివాస భవనాలుగా ఉన్న వాటిని కమర్షియల్ భవనాలుగా చూపిస్తూ తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారు. ఇక సొసైటీల పేర్లతో పొందిన అనుమతుల గురించి చెప్పనవసరం లేదు. కార్పొరేట్ స్థాయిలో ఫోజులు కొడుతూ అధిక ఫీజులు వసూలు చేసే ఓ దంపతులు ఏకంగా క్షేత్రస్థాయిలో కనిపించని స్కూల్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి అనుమతులు పొందినట్లు సమాచారం.2014 నుంచే ఈ అక్రమాలకు బీజం పడిందనే విషయం టీ మీడియా పరిశీలనలో వెలుగులోకి వచ్చింది.ఖమ్మం నగరంలో 1960లో తొలి ప్రైవేట్ పాఠశాలగా సెయింట్ మేరీస్ ప్రారంభమైంది. అనంతరం 1990 దశకంలో కొన్ని బడ్జెట్ స్కూళ్లు ఏర్పడ్డాయి. 2010 తరువాత ఖమ్మంలో కార్పొరేట్ విద్య ప్రభావం పెరగడంతో విద్యా వ్యాపారం విస్తరించింది. ఈ క్రమంలో విలువలకు కట్టుబడి బడ్జెట్ స్కూళ్లు నిర్వహిస్తున్న కొంతమంది తమ సంస్థలను మూసివేయాల్సి వచ్చింది.అదే సమయంలో అదుపులేని కార్పొరేట్ సంస్థలతో చేతులు కలిపిన కొందరు, అధికారులు మరియు రాజకీయ నాయకుల సహకారంతో నకిలీ పత్రాల ద్వారా అనుమతులు పొంది, గుర్తింపు నంబర్లను అడ్డం పెట్టుకుని అనతి 3లో

మున్సిపల్ రికార్డుల్లో లేని ప్రభుత్వ గుర్తింపు స్కూలు ఇంటి నంబర్

బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి

టీఏసీ సమావేశంలో

ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

టి మీడియా, జూన్ 5, ఖమ్మం: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తన సేవలను మరింత వేగవంతం చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

సేవల్లో నాణ్యత పెరగాలి

ఈ సందర్భంగా మాట్లాడుతూ...మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన బాధ్యత. బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్‌వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. 3లో

దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

టి మీడియా, జూన్ 5,సత్తుపల్లి:ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్హత గల దరఖాస్తును నిబంధనల ప్రకారం వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన సమస్యలపై గురువారం సత్తుపల్లి తహసీల్దారు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో 3లో

మొక్కలు నాటిన జడ్జి భవాని.

టి మీడియా, జూన్ 5,దమ్మపేట: పంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా దమ్మపేట కోర్టు జడ్జి శ్రీమతి బొమ్మతి భవాని ఆధ్వర్యంలో కోర్టు ఆవరణంలో పలు రకాల మొక్కలను నాటారు సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి చెట్లు ఎంతో అవసరమని మొక్కలు పెంచడం వల్ల మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు ఈ క్రమంలోనే ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొంది మురళీమోహన్, న్యాయవాదులు మారం సతీష్ కుమార్, నల్లపు ఉదయ్ కుమార్, కాలం సంధ్యారాణి, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, అరుణ రాణి, తదితరులు పాల్గొన్నారు.

మాదాపురం గ్రామసభలో ఘర్షణ

సర్పంచ్, వార్డు మెంబర్లపై దాడి.. కేసు నమోదు!

టీ మీడియా, జూన్ 5, ముదిగొండ : మాదాపురం:గ్రామసభలో జరిగిన ఘర్షణకు సంబంధించి మాదాపురం సర్పంచ్ ఉప్పనూరి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఘటన వివరాలు:ఈరోజు ఉదయం 10:30 గంటలకు మాదాపురంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ నాగమణి, ఆమె భర్త ఉప్పనూరి వెంకటరెడ్డి మాట్లాడుతుండగా ఈ గొడవ జరిగింది.సర్పంచ్‌పై దాడి: వేణుగోపాల్ రెడ్డి అనే వ్యక్తి వెంకటరెడ్డిని కొట్టడానికి వచ్చాడు. అది చూసి ఆపడానికి వెళ్లిన సర్పంచ్ నాగమణిని సదరు వ్యక్తి అసభ్యకరంగా బూతులు తిడుతూ చేతులతో నెట్టివేశాడు.వార్డు మెంబర్‌కు గాయాలు: గొడవను అడ్డుకోవడానికి వచ్చిన వార్డు మెంబర్ గడ్డం వైష్ణవి జుట్టు పట్టుకుని, ఆమె తలను సిసి) రోడ్డుకు వేసి యెన్నం శ్రీనివాసరెడ్డి కొట్టాడు. ఈ దాడిలో వైష్ణవి తలకు, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి.భర్తపై కర్రతో దాడి: వైష్ణవిని కాపాడడానికి వచ్చిన ఆమె భర్త గడ్డం వెంకట్రామిరెడ్డిపై మొదటి వార్డు మెంబర్ గుంటి గంగాధర్ కర్రతో దాడి చేశాడు. దీంతో వెంకట్రామిరెడ్డి చేతికి గాయమైంది.చంపేస్తామని బెదిరింపులు: వేణుగోపాల్ రెడ్డి తమను చంపేస్తానని బెదిరిస్తూ, తీవ్ర పదజాలంతో బూతులు తిట్టాడని సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసుల చర్యలు:సర్పంచ్ ఉప్పనూరి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, ఇన్స్పెక్టర్ గారి ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.

ఘాట్ రోడ్ లో దోస్త్ వాహనం బోల్తా

15మందికి గాయాలు

టీ.మీడియా,జూన్5 ,చింతూరు:సామర్లకోట మండలం మేడపాడు గ్రామానికి చెందిన కొంతవంది విహారయాత్రకి శుక్రవారం దోస్త్ వాహనంలో సుమారు 25 మంది బయలుదేరారు.మారేడుమి ల్లి సందర్శించిన అనంతరం చింతూరు మండలంలోని వాటర్ ఫాల్స్ కు సందర్శనార్థం బయలుదేరారు. ఓవర్ లోడ్ అవ్వడంతో డ్రైవర్ అదుపుతప్పి ఘాట్ రోడ్లో దుర్గాదేవి గుడి సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనకి సంబంధించిన వివరాలను ఎస్సి హేమంత్ కుమార్ వివరిస్తూ ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయని . తీవ్ర గాయాలైన ఇద్దరిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఓవర్ లోడ్ తోటి, సుమారు పాతికమందిని ఎక్కించి డ్రైవింగ్ చేసినందుకు డ్రైవర్ పై నమోదు చేయడం జరిగిందని చెప్పారు. సకాలంలో పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య సిబ్బంది స్పందించారని తెలిపారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

టీ.మీడియా,జూన్5,చింతూరు :ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు మాజీ బిజెపి మండల అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి మొక్కలు నాటారు. తొలుత డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఆవరణలో, అనంతరం చట్టి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు తుర్రం అశోక్, మడివి కన్నారావు, మడివి రాజులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టుల ప్రాంగణంలో వనమహోత్సవం

మొక్కలు నాటి సంరక్షించాలి:

జిల్లా ప్రధాన న్యాయమూర్తి

టి మీడియా, జూన్ 5, ఖమ్మం:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఖమ్మం జిల్లా కోర్టుల ప్రాంగణంలో హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, జిల్లా అటవీ శాఖ అధికారులు కలిసి మొక్కలు నాటారు.ఉదయం 10 గంటలకు జిల్లా అదనపు న్యాయమూర్తులు, జామ, మామిడి, ఉసిరి, మర్రి, రావి, కానుగ ఇతర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, పాల్గొన్నారు.ఖమ్మం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అదేవిదంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పరిధి రేంజర్ ,సిబ్బంది మొక్కలు, నాటి,ట్రీ గార్డులు, ఎరువులు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులు మాట్లాడుతూ, "కాలుష్యం కోరలు చాస్తున్న నేటి కాలంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరం. 'మొక్కలు నాటుదాం – భవిష్యత్‌ను కాపాడుదాం' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. మొక్క నాటడమే కాదు, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యత తీసుకోవాలి. న్యాయ స్థానాలు న్యాయంతో పాటు పచ్చదనానికి కూడా నెలవు కావాలి" అని ఆకాంక్షించారు.అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ,లి "తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పర్యావరణ దినోత్సవం వారోత్సవాలు జరగనున్నాయని తెలిపారు,ఈ ఏడాది జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లా కోర్టు వంటి ప్రభుత్వ కార్యాలయాలు ముందుకు రావడం శుభపరిణామం. నాటిన మొక్కలకు మూడు సంవత్సరాల పాటు అటవీ శాఖ సహకారం ఉంటుంది" అని తెలిపారు.

మన డబ్బులు -- మన లెక్కలు యాప్ ప్రారంభోత్సవం

టీ.మీడియా, జూన్5, చింతూరు:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మన డబ్బులు -- మన లెక్కలు" కార్యక్రమం ప్రారంభోత్సవం శుక్రవారం చింతూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు యాప్ వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఏపిఎం సుధాకర్ మాట్లాడుతూ, ఈ యాప్ ద్వారా మహిళా సంఘ సభ్యులు తమ సంఘానికి సంబంధించిన లెక్కలు, పొదుపులు, రుణాలు, ఇతర ఆర్థిక వివరాలను పారదర్శకంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. మండలంలోని 45 గ్రామ సమైక్యల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు .మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సమాఖ్య నాయకులు, ఈ–నారీ లు, మహిళా సంఘ సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల యోధుడు కొడెం లక్ష్మీనర్సు కన్నుమూత

సీపీఐ(ఎం) పార్టీ పతాకంతో ఘన నివాళులు

టీ మీడియా,జూన్05,సింగరేణి (కారేపల్లి):సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు కొడెం లక్ష్మీనర్సు (60) శుక్రవారం మృతి చెందారు.కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు.ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన లక్ష్మీనర్సు,అమరజీవి ఏలూరు లక్ష్మీనారాయణ నాయకత్వంలో తన సోదరుడు కొడెం అనంతరాములతో కలిసి పూర్వ ఇల్లందు డివిజన్‌లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు.పార్టీ కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచిన ఆయన సేవలను సహచరులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.మధిర మాజీ ఎమ్మెల్యే అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు వద్ద సుదీర్ఘకాలం డ్రైవర్‌గా పనిచేసిన లక్ష్మీనర్సు పార్టీతో పాటు ప్రజలతోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగించారు.ఆయన భార్య పద్మ గతంలోనే మృతి చెందగా, కుమార్తెలు స్వాతి, రాణిలను వదిలి వెళ్లడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచింది.గాంధీనగర్‌లో నిర్వహించిన అంతిమయాత్రలో సీపీఐ(ఎం) నాయకులు,కార్యకర్తలు ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, సీనియర్ నాయకులు కరపటి వీరస్వామి, కేసగాని రామ్మూర్తి, ఈసం వెంకటేశ్వర్లు, కరపటి లక్ష్మయ్య, గోవర్ధనగిరి దశరథ్, జాగటి నాగేశ్వరరావు, కొడెం బోస్, బాయమ్మ, నీలిమ, గోపి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్

టి మీడియా, జూన్ 5,బూర్గంపహాడ్ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కర్మాగారం పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ కోసం పాటించాల్సిన అంశాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ రాంబాబు, టెక్నికల్ హెడ్ జయంత్కుమార్దాస్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రపుల్లా కుమార్ సమంత సింగార్లతో కలిసి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలన్నారు.కాలుష్యాన్ని నివారించడం కోసం కర్మాగారంలో పచ్చదనానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. అనంతరం కార్మిక కుటుంబాల పిల్లలు, మేనేజర్లు, కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా కర్మాగారం పరిసరాల్లో, లారీ యార్డు ఆవరణలో మేనేజర్లు, ఐటీసీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అధికారులు చెంగల్‌రావు, టీఎస్ భాస్కర్, ఆర్పీ సింగ్, మనీష్ శర్మ, శివరామకృష్ణ, సౌరబ్ ముఖర్జీ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా రవీందర్ రెడ్డి

13 సభ్యులతో ప్రమాణ స్వీకారం

టి మీడియా, జూన్ 5, కురవి :మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం చైర్మన్ గా కొర్ను రవీందర్ రెడ్డి 13 మంది పాలకమండలి సభ్యులతో .దేవదాయ శాఖ మహబూబాబాద్ డివిజన్ పరిశీలకులుజి సంజీవరెడ్డి చైర్మన్, పాలకమండలితో దేవాలయ మండపంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం చైర్మన్ పాలకమండలి వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొర్ను రవీందర్ రెడ్డి చైర్మన్, కమిటీ సభ్యులు బాలగాని శ్రీనివాస్కుదురుపాక ఉప్పలయ్య, బండెల సంజీవ రెడ్డిదొంగల జనార్ధన్ రెడ్డిదర్వత్ రజితగద్దెల భిక్షపతిచిన్నం గణేష్,ప్రొద్దుటూరి సత్యనారాయణభూక్యా షాక్రు,గుగులోతు సోమ్లా ,వేమ్పటి శ్రీను,తెగుల్ల వెంకటేష్ గౌడ్,కాసుల మల్లికార్జున్.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం, మహబూబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, జిల్లా నాయకులు బండి శ్రీను, నూకల వేణుగోపాల్ రెడ్డి, రజినీకాంత్ నాయకులు తుకారా నాయక్, శ్యామల శ్రీనివాస్, వార్డు సభ్యులు దైద భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐదు గంటల పనికి కూలి రూ.130లు

-మోతే పట్టీనగర్‌లో ఉపాధి కూలీల ఆందోళన

టి మీడియా, జూన్ 5, బూర్గంపహాడ్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలు చేసిన పనికి వేతనాలు చెల్లించడం లేదని, పనుల ప్రదేశంలో సరైన వసతులు కల్పించడం లేదని బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోతే పట్టీనగర్‌కు చెందిన ఉపాధి కూలీలు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు గంటల పాటు ఎండలో శ్రమిస్తున్నప్పటికీ కూలీ మాత్రం రూ.130 మాత్రమే వేతనంగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించేలా కేంద్రం అమలు చేస్తున్న ఈ పథకం క్షేత్రస్థాయిలో లక్ష్యానికి విరుద్ధంగా సాగుతుందని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని, విశ్రాంతి తీసుకునేందుకు నీడ కూడా కరవైందని ఆరోపించారు.ఉదయం నుండి ఎండలో కష్టించి పని చేస్తున్నా శ్రమకు తగిన ఫలితం ఉండడం లేదని, కనీసం తాగేందుకు మంచినీరు కూడా ఉండడం లేదని దీనిపై ఈజీఎస్ అధికారులు స్పందించాలని మండిపడ్డారు. కూలీలు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సంబంధిత శాఖ అధికారులు అక్కడకు చేరుకుని కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకుని న్యాయం చేస్తామని చెప్పి, పనుల ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును అర్హత ఆధారంగా సూక్ష్మంగా పరిశీలించి, నిబంధనల పరంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా జవాబుదారీతనంతో వ్యవహరించా లని సూచించారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలు రీ-సర్వే ప్రక్రియ ద్వారా శాశ్వత పరిష్కారం పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.అటవీ--రెవెన్యూ భూ సరిహద్దు వివాదాలను జాయింట్ సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు.పరిష్కారానికి అర్హత ఉన్న ప్రతి దరఖాస్తును తక్షణమే క్లియర్ చేయాలని, పరిష్కారం సాధ్యం కాని ప్రతి దరఖాస్తుకు స్పష్టమైన కారణాన్ని అర్జీదారునికి తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. సాదా బైనామా, భూభారతి తదితర భూ సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, కేసు ఆధారిత పరిష్కార విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచనలు చేశారు.అంతేకాకుండా, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్వయంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించి, శాఖల వారీగా సమన్వయంతో యుద్ధప్రాతిపదికన వారిస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలనలు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.అంతకుముందు వేంసూరు మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరుగుతున్న భూ సర్వే పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పంట పొలాల్లో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ సర్వే ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్వే డ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రాజేందర్, సత్తుపల్లి తహసీల్దారు లక్ష్మి, వేంసూరు తహసీల్దారు మాణిక్యరావు, సర్వేయర్లు నాగరాజు, మురళీ, నాగు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో బహుళ ప్రయోజనాలు

-ఏదులాపురం సొసైటీ చైర్మన్ లక్ష్మణ్ నాయక్

టి మీడియా, జూన్ 5,ఖమ్మం రూరల్ : పచ్చిరొట్ట ఎరువులతో సాగు రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఏదులాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జరుపుల లక్ష్మణ్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సాగు రైతులకు పచ్చి రొట్ట ఎరువుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన చైర్మన్ మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమా నాగేష్, ఇతర పాలకవర్గ సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. భూమిలో సారాన్ని పెంచేందుకు రసాయనక ఎరువుల వాడకం తగ్గించేందుకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గి పంట దిగుబడులు పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి పచ్చి రొట్టె ఎరువులు కొనుగోలు చేసి భూములలో వేసుకోవాలని ఆయన సూచించారు.వేసవికాలం ముగిసిన తర్వాత పంట వ్యర్థాలను పంట పొలాల్లో కాల్చివేయొద్దని తద్వారా పర్యావరణం దెబ్బతినడంతో పాటు భూసారం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. సాగు రైతులకు తమ సొసైటీ

ద్వారా పంట రుణాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందని సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. భూమిలో తేమ శాతాన్ని గమనించి పత్తి ఇతర విత్తనాలను నాటుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి కావ్య, పాలకవర్గ సభ్యులు మద్ది కళింగారెడ్డి, మట్టా శ్రీకాంత్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి

సంస్థ బలోపేతం అందరి బాధ్యత

బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు.

?ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, యాసా వెంకటేశ్వర్లు, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్ నాయక్, కనకరాజు, మచ్చా రామారావు, రామ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ విద్యకు

కాలంలో వందల కోట్ల ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.న్యూ విజన్ వంటి విద్యాసంస్థల నిర్మాణాలు సాగునీటి కాలువలను ఆక్రమించి చేపట్టడం వల్ల ఖమ్మం నగరం వరద ముప్పుకు గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ముంపు సమయంలో కూడా ఆ సంస్థలపై భారీ ఆస్తి పన్ను బకాయిలు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఇలాంటి ఉదాహరణలు నగరంలో మరెన్నో ఉన్నట్లు సమాచారం.

సాగర్ కాలువ కట్టపై అనుమతి

ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ బైపాస్, ఇల్లందు రోడ్డులోని సాగర్ కాలువ మధ్య గట్టు ప్రాంతంలో లేని నిర్మాణాన్ని చూపిస్తూ, నకిలీ ఇంటి నంబర్ ఆధారంగా "లక్కీ కిడ్స్ స్కూల్ (యూపీఎస్, 1-8)" పేరుతో 2016లో అనుమతి మంజూరు చేసినట్లు సమాచారం.అధికారిక రికార్డుల ప్రకారం నేటికీ అక్కడ స్కూల్ నడుస్తున్నట్లు నమోదై ఉంది. అయితే టీ మీడియా పరిశీలనలో, నగరంలో గుడ్‌విల్‌తో విద్యాసంస్థలు నిర్వహిస్తున్న ఓ కార్పొరేట్ దంపతులు తమ అనుమతి లేని పాఠశాలల్లో జరిగిన అడ్మిషన్లను లక్కీ కిడ్స్ పేరుతో చూపిస్తున్నట్లు తెలిసింది. వారి ఆధీనంలో ఇటువంటి రికార్డుల్లో మాత్రమే కనిపించే మరో ఐదు పాఠశాలలు ఉన్నట్లు సమాచారం. (నకిలీ ఇంటి నంబర్ల వివరాలు -- ఎపిసోడ్ 2లో)

శిక్ష పడేలా చేయడంలో అధికారుల పాత్ర

చేశారు.కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు.న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ, నేరస్తులకు శిక్ష పడే విధంగా కేసుల పరిష్కారంలో కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, కోర్టు లైజరింగ్ ఆఫీసర్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ కలెక్టరేట్‌లో

అధికారిక ప్రకటన వెలువడలేదు. కలెక్టరేట్ పరిసరాల్లో సీఐడీ అధికారుల రాకపోకలు, కార్యాలయంలో సాగుతున్న తనిఖీలతో ఉద్యోగులు, ప్రజల్లో ఆసక్తి నెలకొంది. సోదాలు పూర్తయిన అనంతరం మాత్రమే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గనుల శాఖ కార్యాలయంలో సీఐడీ తనిఖీలు కొనసాగుతుండగా, ఈ వ్యవహారంపై అధికారిక సమాచారం కోసం జిల్లా వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రహదారి పనులు ఎప్పుడు పూర్తయ్యేనో...

టి మీడియా, జూన్ 5, పినపాక

పినపాక మండలం గడ్డంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఐలాపురం ఆర్అండ్‌బి రోడ్డు నుంచి పొట్లపల్లి వరకు చేపట్టిన రహదారి మరమ్మత్తు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.1.42 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు ప్రారంభమై చాలా కాలం గడిచినా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి అధ్వాన్నంగా మారడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రోడ్డుపై పేరుకుపోయిన రాళ్లు ఎగిరి ప్రయాణికులకు తగులుతున్నాయని,సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు సైతం గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇదే మార్గంలో మినీ గురుకులం, ఆశ్రమ పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు ప్రతిరోజూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు, రైతులు ఈ రహదారిపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. రహదారి పనులు పూర్తయితే గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవడంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం వస్తే ఈ రహదారిపై కనీసం ప్రయాణించే పరిస్థితి కూడా ఉండదు. ఈ రహదారిపై జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.